



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 175 | శనివారం 13 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## శాంతి, సయోధ్య ప్రయత్నాలకు
# మద్దతునివ్వండి

**- మణిపూర్ ప్రజలను కోరిన రాష్ట్రపతి ముర్ము**



**ఇంఫాల్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:**

శాంతి, సయోధ్య, సామరస్యత, అవగాహనలతో కలిసి మెలిసి జీవించడానికి జరిగే ప్రయత్నాలకు మద్దతునివ్వాల్సిందిగా మణిపూర్‌లోని అన్ని కమ్యూనిటీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి వుందని చెప్పారు. సేనాపతి జిల్లాలో ఒక రిసెప్షన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గిరిజన వారసత్వానికి, సంస్కృతికి గర్వకారణమైన ఈ జిల్లాలో పర్యటించడం తనకెంతో సంతోషంగా వుందన్నారు. సానుకూల సామాజిక మార్పును తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ప్రధాన మహిళా స్వరమైన నుపీ లాల్ స్మారక దినోత్సవాన్ని ఈరోజు దేశం జరుపుకుంటోందని ఆమె పేర్కొన్నారు. అధిక సంఖ్యలో గిరిజన కమ్యూనిటీలు కలిగిన సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యం కలిగిన రాష్ట్రం మణిపూర్ అని

- మిగతా 2లో..

## వాయు కాలుష్యంపై
# చర్చ జరగాలి

**లోక్‌సభలో రాహుల్ డిమాండ్**



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:**

దేశంలోని ప్రధాన నగరాల్లో నెలకొన్న వాయు కాలుష్యంపై లోక్‌సభలో చర్చ జరగాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం కోరారు. జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతూ, ఈ అంశంపై చర్చ జరిగే సమయంలో ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఒకరినొకరు నిందించుకోకుండా సమస్యకు ఒక పరిష్కారం కనుగొనేలా వుండాలని, ఆ రకంగా చర్చ జరిగేలా చూడాలని కోరారు. ఇదేమీ సైద్ధాంతికపరమైన అంశం కాదు, ఈ సభలో వున్న ప్రతి ఒక్కరూ గాలి కాలుష్యం సమస్య వుందని అంగీకరిస్తారు, దాని వల్ల ప్రజలకు కలిగే నష్టంతో ఏకీభవిస్తారు. కాబట్టి ఈ విషయంపై మనందరం పరస్పరం సహకరించుకుని

- మిగతా 2లో..

## మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో
# విషాదం

- లోయలో పడిన యాత్రికుల బస్సు.. 8 మంది యాత్రికులు దుర్మరణం
- అల్లూరి జిల్లాలో యాత్రికుల బస్సు బోల్తా
- చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో లోయలో పడ్డ బస్సు
- భద్రాచలం నుంచి అన్నవరం వెళ్తుండగా ఘటన
- కొనసాగుతున్న సహాయక చర్యలు



**మారేడుమిల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన 35 మంది యాత్రికులు, ఇద్దరు డ్రైవర్లతో ఓ ప్రైవేటు బస్సు భద్రాచలంలో దర్శనం ముగించుకుని అన్నవరం బయల ుదేరింది. చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులోని రాజుగారిమెట్ట వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 37 మంది ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న చింతూరు పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి

- మిగతా 2లో..

## మతతత్వ బీజేపీపై
# కలిసి పోరాడుతాం

- ఏపీ పార్టీల మద్దతుతోనే కేంద్ర సర్కారు మనుగడ
- వచ్చే ఎన్నికల్లో యూపీలో ఎగిరేది ఎస్పీజెండానే
- సదర్ సమ్మేళనంలో యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్



**హైదరాబాద్- సూర్య వాస్తవం, డిసెంబర్ 12:**

ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఒక్కతాటిపైనే ఉన్నాయనీ, మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. ఏపీకి చెందిన పార్టీల మద్దతుతోనే కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కారు మనుగడ సాగిస్తోందన్నారు. ఆ రెండు పార్టీలు లేకపోతే మోడీ సర్కారు అధికారంలోకి వచ్చేది కాదని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని

- మిగతా 2లో..



## ఇండిగో సంక్షోభం...
## రంగంలోకి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా

- అంతర్గత లోపాల కారణంగా వందలాది విమానాలను రద్దు చేసిన ఇండిగో
- సంస్థ కార్యకలాపాలపై దృష్టి సారించిన డీజీసీఏ
- పోటీ నిబంధనలను ఉల్లంఘించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న సీసీఐ

2లో

# 9 జిల్లాలతో వీఈఆర్...

- సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- గ్లోబల్ ఎకనమిక్ హబ్‌గా విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)
- 2032 నాటికి 135 బిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- 7 గ్రోత్ డ్రైవర్లతో వీఈఆర్ అభివృద్ధికి ప్రణాళిక
- 30 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే ప్రభుత్వ ధ్యేయం
- అభివృద్ధి ప్రణాళికపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష




**అమరావతి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12**

తొమ్మిది జిల్లాలతో కూడిన విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) ను ప్రపంచస్థాయి ఆర్థిక కేంద్రంగా (గ్లోబల్ ఎకనమిక్ హబ్) తీర్చిదిద్దేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 2032 నాటికి ఈ ప్రాంతాన్ని 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని,

- మిగతా 2లో..



## విశాఖ నగరాలతో కాదు...
# ప్రపంచంతో పోటీ పడుతోంది

**- మంత్రి నారా లోకేశ్**

- విశాఖ మధురవాడలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు శంకుస్థాపన
- సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడితో 25 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యం
- విశాఖను ఏపీకి ఆర్థిక శక్తి కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మంత్రి లోకేశ్
- ప్రపంచంతో పోటీ పడేలా విశాఖను అభివృద్ధి చేస్తామని హామీ

**విశాఖ - సూర్య వాస్తవం, డిసెంబర్ 12**

విశాఖపట్నం ఇప్పుడు దేశంలోని ఇతర నగరాలతో కాకుండా ప్రపంచంతో పోటీ పడుతోందని, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు విశాఖను ఒక పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## మోదీ తీరు పచ్చకామెర్ల
# సామెతలా ఉంది

- వైఎస్ షర్మిల
- ఏపీలో కూటమి పాలన భేషుగ్గా ఉందన్న ప్రధాని మోదీ
- ప్రజల కష్టాలు కనిపించడం లేదా అంటూ షర్మిల ఫైర్
- కూటమి పార్టీల నేతలు గొర్రెల్లా మారారని విమర్శలు



**అమరావతి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏపీలో కూటమి పాలన బాగుందని ప్రధాని చెప్పడం చూస్తుంటే, పచ్చకామెర్లు సోకిన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించినట్లుందని ఆమె ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, రోగులు పడుతున్న

- మిగతా 2లో..

### శాంతి, సయోధ్య ప్రయత్నాలకు
# మద్దతునివ్వండి

(మొదటిపేజీ తరువాయి)
ఆమె కొనియాడారు. సేనాపతి జిల్లాల్లో ఈ వైవిధ్యత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అన్ని కమ్యూనిటీల మధ్య శాంతి, సయోధ్యలు, సామరస్యత, అవగాహనలు నెలకొనాలని, ఇందుకు గానూ జరిగే కృషికి అందరూ తోడ్పడాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. శాంతి కోసం ఈ రాష్ట్ర ప్రజలు పడుతున్న తపనను ప్రభుత్వం అర్థం చేసుకుందన్నారు. ఆ దిశగానే చర్యలు తీసుకుంటోందన్నారు. పలు ప్రాజెక్టులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనేక ప్రాజెక్టులను ప్రారంభించారు. శాంతియుత, సంపద్వంత మణిపూర్ కోసం మనందరం కలిసి కృషి చేద్దామని చెప్పారు.

తపూ నాగ గ్రామంలో ఒక రిసెప్షన్‌కు తాను హాజరయ్యానని, గిరిజన ప్రతినిధులు తనకు సాదరంగా స్వాగతం పలికారని, నిర్వాసితులతో కూడా భేటీ అయ్యానని ఆమె చెప్పారు. మరమ్ గిరిజన తెగ చాలా ప్రత్యేకమైనదని, చాలా దుర్బలమైనదని ఇది దేశ గిరిజన వైవిధ్యతకు ఎంతో దోహదం చేస్తోందని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లోని గిరిజన కమ్యూనిటీలు అభివృద్ధి చెందడం, వారికి అపారంగా అవకాశాలు కల్పించడం వల్ల దేశ పురోగతిలో వారికి కూడా బృహత్తర పాత్రను కల్పించినట్లవుతుందని, అది జాతీయ స్థాయిలో ప్రాధాన్యత గల అంశమని చెప్పారు. వారి అభివృద్ధి కోసం స్థానిక నేతలు, పౌర సమాజాలు, కమ్యూనిటీలతో ప్రభుత్వం కలిసి పనిచేస్తోందన్నారు. దేశ అభివృద్ధి ప్రతి మారుమూలలకు వెళ్ళేలా ప్రభుత్వం చూస్తోందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు.

### వాయు కాలుష్యంపై
# చర్చ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)
చర్చ జరిగి పరిష్కారం కనుగొనేలా చూడాలని రాహుల్ కోరారు. అప్పుడు అందుకు సంబంధించిన ప్రణాళికను ప్రధాని అమలు జరిగేలా చూస్తారన్నారు.

దీనిపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా వుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. లోక్‌సభ సభా కార్యకలాపాల కమిటీ దీనికి సమయాన్ని కేటాయించవచ్చన్నారు. విషపూరితమైన గాలితో కూడిన వాతావరణంలో మన ప్రధాన నగరాల్లో ప్రజలు చాలా వరకు జీవిస్తున్నారని, లక్షలాదిమంది ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులతో బాధ పడుతున్నారని చెప్పారు. వారి భవిష్యత్తు నాశనమై పోతోందన్నారు. ప్రజలకు కొన్ని రకాల కేన్సర్లు వస్తున్నాయన్నారు. వృద్ధులు గాలి పీల్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు.

### మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో
# విషాదం



(మొదటిపేజీ తరువాయి)
చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలిస్తున్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో యాత్రికుల బంధువుల స్వస్థలమైన చిత్తూరు జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### మోదీ తీరు పచ్చకామెర్ల
# సామెతలా ఉంది

(మొదటిపేజీ తరువాయి)
కష్టాలు ప్రధాని మోదీకి కనిపించడం లేదా అని ఆమె ప్రశ్నించారు. ఈ మేరకు షర్మిల ఒక ప్రకటన విడుదల చేశారు. “గిట్టుబాటు ధర లేక రైతులు పంటలను తగలబెడుతున్నా, తుపానులతో సర్వం కోల్పోయినా ప్రభుత్వం ఆదుకోలేని నిర్లక్ష్యం ప్రధానికి కనిపించదు. వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక వారి కష్టాలు, ఆరోగ్యశ్రీ నిలిచిపోవడంతో రోగుల వేదన ఆయన దృష్టికి రావడం లేదు” అని ఆమె పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, హామీల అమలులో కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులను, విభజన హామీలను కూటమి పార్టీలు ప్రధాని కాళ్ల దగ్గర తాకట్టు పెట్టాయని షర్మిల దుయ్యబట్టారు. “వాళ్లు తల ఊపమంటే ఊపే గొర్రెల్లా మారారు కాబట్టే, మోదీకి కూటమి పాలన భేష్ అనిపిస్తోంది. ప్రధాని హోదాలో ఉండి అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన నిజాలు దాగవు” అని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వానిది అసమర్థ పాలన అని, ఆర్భాటాలు తప్ప ఆచరణలో హామీల అమలు శూన్యమని షర్మిల విమర్శించారు. రాష్ట్రంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, విభజన హామీలు అమలు చేసి, ప్రత్యేక హోదా ఇవ్వాలని, అమరావతి నిర్మాణానికి

### మతతత్వ బీజేపీపై
# కలిసి పోరాడుతాం

(మొదటిపేజీ తరువాయి)
ఆదర్శ్‌నగర్‌లోని ఎమ్మెల్యేల నివాస సముదాయంలో జరిగిన సదర్ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలు పార్టీల నాయకులు వేదికపై ఉన్నప్పటికీ యాదవులందరూ ఒక్కటేనని చెప్పారు. భగవాన్ శ్రీకృష్ణుడి ఆశీస్సులు యాదవులందరిపైనా ఉంటాయన్నారు. యూపీ, ఏపీ నుంచి కూడా తమ పార్టీకి చెందిన నేతలు ఇక్కడకు వచ్చారని తెలిపారు.

రాజకీయాలకు అతీతమైన వేదిక ఇది అనీ, వేర్వేరు పార్టీలకు చెందిన వారమైనప్పటికీ, అందరం కూడా ఒక్కటేనని ప్రకటించారు. పెండ్లీండ్ల సందర్భంగా గుర్రపు బగ్గీపై కూర్చుని బరాత్‌లో పాల్గొనటం చూశాననీ, ఇప్పుడు ఇక్కడ గుర్రపు బగ్గీపై ప్రధాన వేదిక వద్దకు తనను తీసుకురావడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. మాజీ ఎంపీ అంజన్ కుమార్ ప్రత్యేకత ఉన్న నాయకుడనీ, అందుకే నన్ను బగ్గీపై ఊరేగించారని చమత్కరించారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో సాదరంగా ఆహ్వానం పలకడమే కాకుండా శ్రీకృష్ణ నినాదాలు చేయడం ఈ కార్యక్రమానికి మరింత శోభనిచ్చిం దన్నారు. ఉత్తరప్రదేశ్ బీజేపీని వెనక్కునెడుతున్నామనీ, వచ్చే ఎన్నికల్లో ఎస్పీ సారథ్యంలోని కూటమి జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ములాయం సింగ్ యాదవ్ తనను చిన్న వయస్సులోనే ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి సీఎంను చేశాడని కొనియాడారు. తనలాగే అనిల్ కుమార్ యాదవ్ కూడా చిన్న వయస్సులోనే రాజ్యసభ సభ్యుడయ్యారని ప్రశంసించారు.

సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర పండుగగా ఆచరించడం సంతోషించదగ్గ విషయమని కితాబిచ్చాడు. అందుకు కృషి చేసిన అంజన్ కుమార్ యాదవ్, ఇతర నేతలను ఆయన అభినందించారు. సదర్ ఉత్సవానికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమ్మేళనానికి వేలాదిగా జనం హాజర య్యారనీ, ఇంకా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్, పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్, టీపీసీసీ నేత గౌరీ యాదవ్, యాదవ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, బతుకమ్మ ఆటపాటలు, ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శనలు, ఉత్తరాది డ్రమ్స్ ప్రదర్శన తో అఖిలేశ్ యాదవ్‌ను అంజన్‌కుమార్, అనిల్ కుమార్‌యాదవ్, వీహెచ్, తదితరులు స్వాగతించారు. గుర్రపు బగ్గీపై ఊరేగింపుగా వేదికవద్దకు తీసుకెళ్లారు. ఏకేవై పేరుతో యువత హల్‌చల్ చేసింది. దున్నపోతుల ప్రదర్శనను చేసింది. సభలోకి పట్టుకొచ్చిన చిన్న దూడ అందర్నీ ఆకట్టుకున్నది.

# 9 జిల్లాలతో వీఈఆర్...

(మొదటిపేజీ తరువాయి)
తద్వారా 30 లక్షల ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా నిర్దేశించారు. వీఈఆర్ అభివృద్ధిపై శుక్రవారం విశాఖలో మంత్రులు, 9 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన తొలిసారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీఈఆర్‌కు సంబంధించిన 49 ప్రాజెక్టులపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. 7 గ్రోత్ డ్రైవర్లు, 10 పాలసీలతో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు అమలు చేయాలని స్పష్టం చేశారు. “విశాఖను మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దాలి. భూసేకరణ ప్రక్రియ వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా జరగాలి. రాష్ట్రంలో విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు ప్రధాన ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం” అని చంద్రబాబు అన్నారు. సమర్థంగా మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే 2047 నాటికి వీఈఆర్ ఆర్థిక వ్యవస్థ 800 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతులు వంటి అన్ని రంగాల్లో వీఈఆర్ అభివృద్ధి చెందాలని సూచించారు. అనకాపల్లిలో త్వరలోనే మెడ్‌టెక్ జోన్-2 ఏర్పాటు చేస్తామని, టాయ్స్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేవారికి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఐటీ, ఏఐ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరానికి మించి డేటా సెంటర్లను ప్రోత్సహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో అనుసంధానించాలని, రహదారుల విస్తరణపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలని, రైతులు లాభసాటి పంటల వైపు మళ్లేలా చూడాలని సూచించారు. కైలాసగిరి నుంచి భీమిలి వరకు ఉన్న తీర ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని చెప్పారు. వీఈఆర్ అభివృద్ధి పనులపై ప్రతి రెండు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

**9 జిల్లాలతో వీఈఆర్**

విశాఖపట్నం-తూర్పు గోదావరి రీజియన్ (వీఈఆర్) సమగ్రాభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక వివరాలు వెల్లడయ్యాయి. మొత్తం 9 జిల్లాల పరిధిలో మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధి లక్ష్యంగా ఈ బ్లూప్రింట్ సిద్ధమైంది.

**వీఈఆర్ స్వరూపం – గణాంకాలు**

ప్రాంతం: మొత్తం 9 జిల్లాలు ఉన్నాయి. అవి: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ.

**ప్రస్తుత పరిస్థితి:** ఈ ప్రాంతంలో 1.65 కోట్ల జనాభా నివసిస్తుండగా, 38,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉంది. జీడీపీ 52 బిలియన్ డాలర్లు కాగా, తలసరి ఆదాయం 3,170 డాలర్లుగా ఉంది. ఇక్కడ 70 లక్షల మంది వర్క్‌ఫోర్స్ అందుబాటులో ఉంది. రాష్ట్రంలో వాటా: ఏపీ భౌగోళిక విస్తీర్ణంలో వీఈఆర్ వాటా 31శాతం కాగా, రాష్ట్ర జనాభాలో 23శాతం, జీడీపీలో 30శాతం వాటాను కలిగి ఉంది.

**అభివృద్ధి ప్రణాళికలు**

7 గ్రోత్ డ్రైవర్లు: గ్లోబల్ పోర్ట్, నెక్స్ట్ జెన్ ఐటీ, వ్యవసాయం, టూరిజం, హెల్త్ కేర్ హబ్, పక్కా ప్రణాళికతో పట్టణీకరణ-గృహ నిర్మాణం, అత్యుత్తమ మౌలిక వసతుల కల్పన ద్వారా అభివృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పోర్టులు, రవాణా: మొత్తం 6 పోర్టులు ఉంటాయి. ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం, గంగవరం, కాకినాడ డీప్ వాటర్, కాకినాడ యాంకరేజ్ పోర్టులకు అదనంగా కాకినాడ గేట్ వే, మూలపేటలో కొత్త పోర్టులు రానున్నాయి. కొత్తగా 7 రైల్వే ప్రాజెక్టులు, 9 రహదారుల ప్రాజెక్టులతో పాటు 77 కిలోమీటర్ల మేర విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగం: 12 తయారీ కేంద్రాలు, 18 వ్యవసాయ ప్రాంతాలు, ప్రపంచ స్థాయి నర్సరీ, ఫుడ్ పార్కులు, ఆక్వాపార్క్, 5 ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

**భవిష్యత్ అవసరాలు**

వీఈఆర్ అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి అదనంగా 7.5 లక్షల ఇళ్లు, 10 వేల హోటల్ గదులు, 20 మెడికల్, ఐటీ, స్కిల్లింగ్ కాలేజీలు, 5,000 ఆసుపత్రి పడకలు అవసరమవుతాయి. అలాగే పరిశ్రమల కోసం 50 వేల ఎకరాలు, 50 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్థలం, 60 మిలియన్ చదరపు అడుగుల గిడ్డంగులు అవసరమని అంచనా వేశారు.

### విశాఖ నగరాలతో కాదు...
# ప్రపంచంతో పోటీ పడుతోంది

(మొదటిపేజీ తరువాయి)
లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ విశాఖలో తన శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయడం చారిత్రక మైలురాయి అని ఆయన అభివర్ణించారు. శుక్రవారం నాడు విశాఖ మధురవాడలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న తీరును, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

**విశాఖ ఐటీ రంగంలో చారిత్రక ఘట్టం**

ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ సుమారు రూ.1500 కోట్ల పెట్టుబడితో విశాఖలో తన కార్యకలాపాలు ప్రారంభించడం ఒక కొత్త టెక్ యుగానికి నాంది అని లోకేశ్ అన్నారు. ఈ పెట్టుబడి ద్వారా తొలుత 8 వేల మందికి, భవిష్యత్తులో 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇప్పటికే వెయ్యి మందితో తాత్కాలిక క్యాంపస్‌ను కూడా ప్రారంభించామని, ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, కాగ్నిజెంట్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మధ్య బలమైన భాగస్వామ్యానికి ఆరంభమని పేర్కొన్నారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి సారిస్తుందని, తద్వారా విశాఖ డిజిటల్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం అవుతుందని వివరించారు. ఈ క్యాంపస్‌లోని ప్రతి సీటు కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, మన యువత కలలకు, భవిష్యత్తుకు వేదిక అని అన్నారు.

**యువతకు పిలుపు.. చంద్రబాబు, మోదీ స్ఫూర్తి**

కాగ్నిజెంట్‌లో పనిచేసే ఉద్యోగులంతా విశాఖకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని 25 ఏళ్ల యువకుల్లా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, వారి నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. రాష్ట్రంలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు సృష్టించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆంధ్రప్రదేశ్, విశాఖ, తెలుగు ప్రజలు గర్వపడేలా చేద్దామని అన్నారు.

### ఇండిగో సంక్షోభం...
# రంగంలోకి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా

**- అంతర్గత లోపాల కారణంగా వందలాది విమానాలను రద్దు చేసిన ఇండిగో**
**- సంస్థ కార్యకలాపాలపై దృష్టి సారించిన డీజీసీఏ**
**- పోటీ నిబంధనలను ఉల్లంఘించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న సీసీఐ**

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 12**

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రంగంలోకి దిగింది. అంతర్గత లోపాల కారణంగా ఇండిగో వందలాది విమానాలను రద్దు చేయడంతో డీజీసీఏ దర్యాప్తు జరుపుతోంది. సంస్థ కార్యకలాపాలపై డీజీసీఏ దృష్టి సారించింది. ఇప్పుడు సీసీఐ కూడా రంగంలోకి దిగి, పోటీ నిబంధనలను ఇండిగో ఉల్లంఘించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశీయ పౌర విమానయాన రంగంలో ఇండిగో దాదాపు 65 శాతం వాటాను కలిగి ఉంది. ఈ సంస్థ డిసెంబర్ 2 నుంచి వందలాది విమా నాలను రద్దు చేసింది. దీంతో కొన్ని వేల మంది తమ ప్రయాణాలు రద్దై ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై డీజీసీఏ దర్యాప్తు చేస్తోంది. పెద్ద ఎత్తున విమానాల రద్దుకు అతిపెద్ద మార్కెట్ వాటాను కలిగి ఉండటమే కారణమా అనే కోణంలో సీసీఐ అంతర్గతంగా పరిశీలిస్తోంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని, సుమోటోగా అంశాన్ని సీసీఐ పరిశీలిస్తోందని సీనియర్ అధికారి పీటీఐకి వెల్లడించారు. విమానయాన రంగంలో ఆధిపత్య స్థానం, నిర్దిష్ట మార్గాల్లో ఆధిపత్యం, ఆధిపత్య దుర్వినియోగం వంటి అంశాలను సీసీఐ పరిశీలిస్తోందని సమాచారం. అత్యధిక మార్కెట్ వాటా కలిగి ఉండటం పోటీని ఉల్లంఘించినట్లు కాదు కానీ, ఆ ఆధిపత్య స్థానాన్ని దుర్వినియోగం చేస్తే మాత్రం పోటీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని సీసీఐ సంబంధిత అధికారి తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు చేసి, పోటీ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సమగ్ర దర్యాప్తునకు ఆదేశించే అవకాశం ఉంటుంది.

# సంపాదకీయం

## ఒకే ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద

దేశ ఆదాయంలో 58శాతం.. ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10శాతం వారికే దక్కుతోంది. భారత్‌లోని 40 శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతం మంది సంపన్నుల వద్ద ఉంది. భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94 శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం.. - 2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు.

- నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారు" అన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు.ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది.వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు.

ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10శాతం వర్గం సుమారు 65శాతం సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది.ఆదాయ అసమానలతు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58శాతం ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10శాతం వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న 50శాతం వర్గం వారికి దేశ ఆదాయంలో కేవలం 15శాతం మాత్రమే దక్కుతోంది.2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్ 10శాతం వర్గం, బాటమ్‌లోని 50శాతం వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేళ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి.భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28000 యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7శాతం మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది.ఇక మొత్తంగా భారతదేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలు స్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది.140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు స్థిరమైన ఆదాయంతో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వారు కేవలం 13-14 కోట్ల మంది మాత్రమేనని ఈ అధ్యయనం సూచిస్తోంది. అంటే భారత మార్కెట్‌ను అర్థం చేసుకోవాలంటే కేవలంజనాభా పరంగా కాకుండా, ప్రజల ఆదాయ స్థాయిలను, ఖర్చు విధానాలను విశ్లేషించడం అవసరం. భారత్‌లో ఆర్థిక అసమతుల్యత గణనీయంగా ఉంది. నగరాల్లో ఉన్నత, మధ్య తరగతులకు మంచి ఆదాయ వృద్ధి కనిపిస్తున్నా, గ్రామీణప్రాంతాల్లో ఇంకా తక్కువ ఆదాయ స్థాయిలు కొనసాగుతున్నాయి. ఆదాయ వ్యవస్థ మెరుగుపడకపోతే వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరగదు. దేశంలో చాలా మంది అనిశ్చిత ఉపాధిపై ఆధారపడటంతో, నిర్దిష్ట ఆదాయ స్థాయిని చేరుకోవడం కష్టమవుతోంది. 100 కోట్ల మంది వినియోగదారులు వ్యక్తిగత ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వీరి ఆదాయం ప్రధానంగా ఆహారం, వైద్యం, విద్య వంటి అవసరాలకే సరిపోతోంది.

విలాస వస్తువులు, గృహోపకరణాలు, వినోదం, టూరిజం వంటి విభాగాల్లో వీరు పెద్దగా ఖర్చు చేయడం లేదు. ఈ వాస్తవం మార్కెట్ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మధ్యతరగతి, ఉన్నత వర్గాలే లక్ష్యం. భారత మార్కెట్‌ను అనేక కంపెనీలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలను లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేశాయి. అయితే, వినియోగ సామర్థ్యం పరంగా చూస్తే, తక్కువ ఆదాయం గల వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఉన్నందున, మార్కెట్ వ్యూహాలను పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ప్రీమియం ఉత్పత్తులతో పాటు, బడ్జెట్ -ఫ్రెండ్లీ ప్రోడక్ట్స్, స్థిరమైన ధరల వ్యూహాలు, ఫైనాన్స్- ఆధారిత వినియోగ మోడల్స్ ద్వారా ఈ వర్గాన్ని ఆకర్షించే మార్గాలను పరిశీలించాలి. భారత మార్కెట్ వృద్ధి కొనసాగాలంటే కేవలం ఉన్నత ఆదాయ వర్గాలను లక్ష్యంగా పెట్టుకోవడం సరిపోదు. తక్కువ ఆదాయ గల వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వారికి అందు బాటులో ఉండే ఉత్పత్తులు, సేవలు రూపొందించాలి. సరసమైన ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం, ఈఎంఐ లేదా ఫైనాన్స్ మోడళ్లను ప్రవేశపెట్టడం, గ్రామీణ మార్కెట్లకు చేరువ కావడం ద్వారా వినియోగదారుల స్థాయిని విస్తరించుకోవచ్చు. డిజిటల్ విస్తరణ ద్వారా కూడా ఈ వర్గానికి మార్కెట్‌ను మరింత చేరువ చేయొచ్చు. ఈ మార్గాల్లో వ్యూహాలు అమలు చేస్తే తక్కువ ఆదాయంగల వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరిగి, భారత ఆర్థికవృద్ధికి కొత్త దిశలో ఉత్సాహం లభించవచ్చు. ఆర్థిక అసమతుల్యతను అధిగమించాలంటే ఉపాధి కల్పన సరైన పరిష్కా రంగా పరిగణించాలి. ప్రజల ఆదాయాన్ని పెంచేలా.. ప్రభుత్వ కార్యక్రమాలు.. ఉద్యోగ కల్పన పెంచడం, కార్మిక వేతనాలు పెంచడంతోపాటు, స్థిరమైన ఉపాధి అవకాశాలను పెంచడం, వ్యవసాయాన్ని ఆదాయ వృద్ధి మార్గంగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ, గోదాములు, ప్రత్యక్ష మార్కెటింగ్ విధానాలు అవసరం. వినియోగదారుల మార్కెట్ విస్తరణపై దృష్టి పెట్టడం అత్యవసరం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వృద్ధిని సాధించవచ్చు.

# మళ్లీ మొదటికొచ్చిన వివేకా కేసు

**కడప - సూర్య వాస్తవం**

వైఎస్ వివేకా హత్య కేసు క్లైమాక్స్‌లో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కు..ఆల్ మోస్ట్ దర్యాప్తు కంప్లీట్..అయినా ఇంకా ఎక్కడో డౌట్ అన్నట్లుగా కొనసాగుతోన్న వివేకా హత్య కేసు వివాదం ఎంతకు కొలిక్కి రావడం లేదు. వివేకా కూతురు సునీత న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. లేటెస్ట్‌గా ఆమె లేవనెత్తిన పలు అంశాలపై దర్యాప్తునకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే వివేకా హత్య కేసులో నిందితుల ఫోన్ కన్వర్జేషన్ కీలక ఆధారంగా మారింది.ఇప్పటికే వివేకా హత్య కేసు తొలి దర్యాప్తు అధికారి సీఐ శంకరయ్యను ఏపీ సర్కార్ డిస్మిస్ చేసింది. వివేకా హత్య జరిగినప్పుడు పులివెందుల సీఐగా ఉన్న శంకరయ్య.. సాక్ష్యాధారాలు చేరిపివేస్తున్నా చూస్తూ ఊరుకున్నారన్న ఆరోపణలను ఫేస్ చేస్తున్నారు. అయితే ఈ ఎపిసోడ్ ఇలా ఉండగానే లేటెస్ట్‌గా సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఆసక్తికరంగా మారాయి.వివేకా హత్య కేసులో ఇన్ డీటేయిల్డ్ దర్యాప్తు జరగలేదని, పలు అంశాలపై దర్యాప్తు అసంపూర్తిగా ఉందని నిందితులు చెప్తున్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సీబీఐ కోర్టును కోరారు సునీతారెడ్డి. వివేకా హత్య కేసులో మిగతా దర్యాప్తు కంటిన్యూ చేయాలంటూ సునీత వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సీబీఐ కోర్టు..కీలక ఆదేశాలు ఇచ్చింది.వివేకా హత్య కేసులో కొన్ని అంశాలపై రీఇన్వెస్టిగేషన్‌కు సీబీఐ కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు డైరెక్షన్‌లో కేసును మళ్లీ విచారించాలని వివేకా కూతురు సునీత సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు..కొన్ని అంశాలపై మాత్రం ఇన్వెస్టిగేషన్‌కు అనుమతులు ఇచ్చింది. ౦2 సునీల్ యాదవ్ బ్రదర్ కిరణ్, వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడి కుమారుడు అర్జున్ రెడ్డి ఫోన్ సంభాషణపై దర్యాప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. నెల రోజుల్లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించింది.సీబీఐ కోర్టు ఉత్తర్వులు ప్రకారం వివేకా హత్య కేసులో మళ్లీ పాక్షిక దర్యాప్తు జరగనుంది. ఆ ఇద్దరి ఫోన్ కన్వర్జేషన్‌పై దర్యాప్తునకు సీబీఐ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ కేసులో సునీత వ్యక్తం చేసిన అన్ని సందేశాలపై కోర్టు విచారణకు అనుమతించలేదు. అంతేకాకుండా పాక్షిక దర్యాప్తును నెలరోజుల్లో పూర్తి చేయాలని కూడా కోర్టు చెప్పడం ఉత్కంఠ రేపుతోంది.అయితే సునీత వ్యక్తం చేస్తున్న డౌట్స్‌పై కోర్టు విచారణకు ఆదేశించకపోవడం.. నిందితులకు కాస్త రిలీఫేనన్న చర్చ జరుగుతోంది. హత్య జరిగిన రోజు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ నుంచి వైసీపీ పెద్దలకు ముందే సమాచారం ఇచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు సునీత. ఈ విషయంపై దర్యాప్తు జరపలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రిటైర్డ్ ఐఏఎస్ అజేయ్ కల్లం తన వాంగ్మూలంలో ఉదయం 5 గంటలకు హైదరాబాద్ లోటస్ పాండ్‌లో తాము జగన్‌తో సమావేశంలో ఉండగా, భారతి నుంచి జగన్‌కు పిలుపు వచ్చిందని, ఆ తర్వాత జగన్ తమతో వివేకా మరణంపై చెప్పారని అజేయ్ కల్లాం వాంగ్మూలమిచ్చారని గుర్తు చేశారు సునీత.అయితే భారతికి ఎలా సమాచారం వచ్చింది.? ఎవరి నుంచి వచ్చిందన్న అంశంపై సీబీఐ దర్యాప్తు చేయలేదని, ఆ అంశాలపై దర్యాప్తు చేయాలని సునీత కోరారు. కేసు విచారణను సీబీఐ సగంలోనే వదిలేసిందని, నిందితులు పొంతన లేని వాంగ్మూలాలు ఇవ్వడంపైనా సీబీఐ దృష్టిపెట్టలేదని సునీత అభ్యంతరం వ్యక్తం చేశారు.అయితే కోర్టు మాత్రం సునీత లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం అర్జున్ రెడ్డి, కిరణ్ యాదవ్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపైనే దర్యాప్తునుకు ఆదేశించింది. హత్య జరిగిన రోజు తెల్లవారుజామున 1.42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డికి..వివేకా సర్ చనిపోయాడనే మెసేజ్ వెళ్లిందని సీబీఐ గుర్తించింది. కానీ, ఆ మెసేజ్‌పై దర్యాప్తు చేయలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో ఈ విషయంపైనే దర్యాప్తు కొనసాగనుంది.



# మీకూ స్మార్ట్ రేషన్ కార్డు

**ఏలూరు - సూర్య వాస్తవం**

ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజలకు సులభంగా, పారదర్శకంగా రేషన్ అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అక్రమార్కులకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఆగస్టు నుంచి వీటిని పంపిణీ చేస్తోంది ఏపీ. ఇప్పటికే చాలా వరకు పంపిణీ చేసింది.గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులకు అప్పగించే బాధ్యతను ఇచ్చింది. అంతేకాదు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. ఈ నెల 15వ తేదీ వరకు పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. అయితే చాలా మంది లబ్ధిదారులు ఇంకా వాటిని తీసుకోలేదు. వేలాది కార్డులు పంపిణీ చేయలేదు. 15వ తేదీ తర్వాత వాటిని కమిషనరేట్‌కు పంపనున్నారు.గడువు దగ్గరకు వచ్చినా.. సరే అర్హులైన కొందరు స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోలేదు. ఇంకా చాలా కార్డులు పంపిణీ కోసం ఎదురుచూస్తున్నాయి. కొందరికి కార్డులు తీసుకోవాలని సమాచారం ఇస్తున్నా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది, డీలర్లు వారికి ఇచ్చేందుకు ప్రయత్నాలు చేసిన కొన్ని ప్రాంతాల్లో కుదరడం లేదు.అయితే ప్రస్తుతం అందుబాటులో లేకుండా ఉన్నవారు స్మార్ట్ రేషన్ కార్డు తీసుకోకపోవడంపై ఆందోళనలో ఉన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుంది. ఒకవేళ కార్డులు తీసుకోకుంటే రద్దు చేస్తారని చాలా మంది అపోహలో ఉన్నారు. కానీ ప్రభుత్వం ఆ విధంగా చేయదు.సచివాలయాల్లో చిరునామాతోపాటుగా స్మార్ట్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.200 రుసుము చెల్లించాలి. తర్వాత కమిషనరేట్ నుంచి చిరునామాకు రేషన్ కార్డు పంపిస్తారు. ఈ పోస్ యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను స్వైప్ చేయగానే.. లబ్ధిదారుల వివరాలు కనెక్ట్ అవుతాయి. బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కాన్ ద్వారా కూడా స్కాన్ చేసి సరకులు అందిస్తారు.




# చంద్రబాబు తర్వాతే లోకేష్, పవన్

**విజయవాడ- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపాలనలో ప్రతి నిర్ణయం గణాంకాలకు ఆధారపడిందనే విషయం అధికార యంత్రాంగం మాత్రమే కాదు, ప్రజలకూ తెలిసిందే. మాటలు కాకుండా వాస్తవాలు, డేటా ఆధారిత వివరాలు ప్రజల ముందు ఉంచడం ఆయన ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పద్ధతి. ఇదే విధానంతో ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో కూడా సీఎం చంద్రబాబు వివిధ శాఖల ఫైల్ క్లియరెన్స్ వివరాలను బహిర్గతం చేశారు. ఎవరు ఎంత వేగంగా ప్రజాసంబంధ ఫైళ్లను పూర్తి చేశారో అంకెలతో వివరించడంతో అధికారులు, మంత్రులు అందరూ మరింత అప్రమత్తమయ్యారు.మంత్రుల పనితీరును పరిశీలిస్తూ విడుదల చేసిన ఈ సమాచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరో స్థానంలో ఉండడం ప్రత్యేకంగా కనిపించింది. ఆయన తరువాత స్థానాల్లో నారా లోకేష్ తొమ్మిదవ స్థానంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదకొండవ స్థానంలో ఉన్నారు. అయితే ఈ ముగ్గురికంటే ముందుగా ఐదుగురు మంత్రులు ఫైళ్ల పరిశీలనలో వేగం ప్రదర్శించడం గమనించదగిన విషయం. మొదటి స్థానాన్ని డోలా బాల వీరాంజనేయ స్వామి దక్కించుకున్నారు. ప్రజల నుండి వచ్చిన ఫైళ్లను ఆయన సగటుగా రెండు రోజులు 41 నిమిషాల్లో పరిష్కరించడం ఈ ర్యాంక్‌కు ప్రధాన కారణం. మొత్తం 651 ఫైళ్లను క్లియర్ చేసి ముందంజలో నిలిచారు.ఆ తరువాత స్థానాల్లో నిమ్మల రామానాయుడు, ఎన్.ఎస్.డి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, పొంగూరు నారాయణ ఉన్నారు. అదే సమయంలో ఫైల్ క్లియరెన్స్ లో ఆలస్యంగా ఉన్న చివరి ఐదు స్థానాలను కొలుసు పార్థసారథి నాదెండ్ల మనోహర్ , పయ్యావుల కేశవ్ , కొల్లు రవీంద్ర, మడిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆక్రమించారు. సమీక్షలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా అందించేలా వ్యవస్థ సిద్ధం అవుతుందని చెప్పారు. కొంతమంది శాఖలు ఇప్పటికీ భౌతిక విధానంలో సేవలు అందిస్తున్నాయని, వెంటనే డిజిటల్ పద్ధతులకు మారాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ఏ సేవకైనా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా "మనమిత్రా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి తెస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ సేవల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలనీ కూడా ఆదేశించారు.డేటాను ఆధారంగా చేసుకుని పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వేగవంతమైన ఫైల్ క్లియరెన్స్‌తో పారదర్శకతకు మరొక మెట్టు వేసినట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## ఆర్జీయూకేటీ ఆర్కే వాలీలో డ్రోన్ టెక్నాలజీపై హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** ట్రిబుల్ ఐటీ ఆర్జీయూకేటీ ఆర్కే వాలీలో డిసెంబర్ 12 ,13, తేదీల్లో కంప్యూటర్ సెంటర్‌లో డ్రోన్ టెక్నాలజీపై రెండు రోజులు ఇంటెన్సివ్ హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ నిర్వహిం చబడుతోంది. ఈ కార్యక్రమాన్ని అర్జీయూకేటీ ఆర్కే వాలీ యొక్క డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ (డిఐసి), ట్రిబుల్ ఐ టిడిఎం కర్నూలు సహకారంతో నిర్వహిస్తోంది. ఈసీఈ, సి ఎస్ ఈ, ట్రిబుల్ ఈ, ఎంఈ విభాగాల నుండి ఈ1 నుండి ఈ3 వరకు మొత్తం 60 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారు. శిక్షణా కార్యక్రమాలను నిపుణులైన రిసోర్స్ పర్సన్స్ డా. డి.సందీప్, డి.అఖిల్, అల్తాఫ్ నిర్వహిస్తున్నారు. వారు విద్యార్థులకు ప్రాథమిక సూత్రాలు, హ్యాండ్స్-ఆన్ ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. ఈ వర్క్‌షాప్‌ను వాలీ డైరెక్టర్ ప్రొ. ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా , డా. బి. కొండా రెడ్డి (కోఆర్డినేటర్, డి ఐ సి ),రిసోర్స్ పర్సన్స్, అధ్యాపకులు,విద్యార్థుల సమక్షంలో ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన డైరెక్టర్ డ్రోన్ టెక్నాలజీ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతన, ఇది వ్యవసాయం, సర్వైలెన్స్, విపత్తు నిర్వహణ, పరిశ్రమలలో వినియోగించే విస్తృత అన్వయాలను వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు విలువైన ప్రాక్టికల్ అనుభవాన్ని అందిస్తూ, అభివృద్ధి చెందుతున్న డ్రోన్ టెక్నాలజీలపై వారి అవగాహనను పెంపొందిస్తోంది.

## దుష్యంత్ రెడ్డి జన్మదినాన వృద్ధులకు అన్నదానం



**లింగాల - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ దుష్యంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా లింగాల మండలం ఇప్పట్ల దగ్గర ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్‌లో దుష్యంత్ రెడ్డి అభిమానులు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం దుష్యంతి రెడ్డి అభిమానులు అంబకపల్లె గ్రామస్తులైన కిష్టపాటి గంగిరెడ్డి , బుర్ర చెన్నకేశవ, సాయి, పవన్ రెడ్డి, డిష్ వెంకట్ రెడ్డి తదితరుల చేతుల మీదుగా వృద్ధులకు వడ్డించారు. ఈ సందర్భంగా దుష్యంత్ రెడ్డి రెడ్డి అభిమానులు మాట్లాడుతూ దుష్యంత్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుంటూ పులి వెందులకు ప్రజలకు సేవలు అందించే విధంగా భగవంతుడు ఆశీర్వది ంచాలని, రానున్న కాలంలో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతుని వేడుకుంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నివాసులు దుష్యంత్ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తులసి రెడ్డితో తోటకూర ప్రసాద్ భేటీ



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** అమెరికాకు చెందిన తానా పూర్వ అధ్యక్షులు, ప్రస్తుతం తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, ఆల్ ఇండియా రేడియో కడప స్టేషన్ డైరెక్టర్ చుండూరు మహేష్, జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయ భాస్కర్ గురువారం రాత్రి వేంపల్లిలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తులసి రెడ్డి వారికి శాలువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు.తెలుగు భాషాభివృద్ధి కోసం తీసుకోవలసిన చర్యలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## బేబీ కిట్లును పంపిణీ చేసిన కూటమి నాయకులు



**పామిడి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా ఒక రోజు ముందుగానే పామిడి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్‌ను కట్ చేసి గుమ్మనూరు ఈశ్వర్‌కి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు బేబీ కిట్లు, బ్రెడ్లు పంపిణి చేశారు. ఈసందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో కలకాలం నిండు నూరేళ్లు జీవించి ఉండాలని కోరుకుంటూ మహిళలకు బేబీ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బ్రౌన్ దొర తెలుగు భాషోద్ధారకుడు

- జగన్, చంద్రబాబు తెలుగు భాష విధ్వంసకులు
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** ఆంగ్లేయుడైన సర్ సిపి బ్రౌన్ దొర తెలుగు భాషోద్ధారకుడు, తెలుగు సూరీడు కాగా, తెలుగు వారైన జగన్, చంద్రబాబు తెలుగు భాష విధ్వంసకులు కావడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి లో స్వర్గీయ సర్ సిపి బ్రౌన్ దొర 141 వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఒక ఆంగ్లేయుడైన సర్ సిపి బ్రౌన్ ఈస్టిండియా కంపెనీ తరపున భారతదేశానికి వచ్చి, కడపలో ఇల్లు కొనుక్కొని ,తెలుగు భాష నేర్చుకొని ,తెలుగు నిఘంటువు రచించి ,తెలుగులో అనేక పుస్తకాలు రచించి, వేమన పద్యాలు సేకరించి తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషిచేసి ,పదవీ విరమణ అనంతరము ఇంగ్లాండ్ కు పోయి లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్ గా పని చేశాడన్నారు. అందుకే బ్రౌన్ దొర తెలుగు భాషోద్ధారకుడు, తెలుగు సూర్యుడు అయ్యాడని తులసి రెడ్డి కీర్తించారు. కానీ దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్లో అటు జగన్ పాలనలో, ఇటు చంద్రబాబు పాలనలో తెలుగు భాష పరిస్థితి నానాటికి క్షీణిస్తూ ఉండడం శోచనీయమన్నారు. ప్రపంచంలో ప్రతి దేశము ,భారతదేశంలో ప్రతి రాష్ట్రము పాఠశాల విద్యను ,ప్రత్యేకించి ప్రాథమిక విద్యను తమ తమ మాతృభాషలోనే బోధిస్తూ ఉన్నాయి. కానీ దురదృష్టవశాత్తు గతంలో జగన్ ప్రభుత్వం 2019 నవంబర్ 20వ తేదీన జీవో 85 ద్వారా పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దుచేసి ,ఆస్థానములో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ఒక చారిత్రిక తప్పిదం. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవో 85 ను రద్దు చేయకుండా కొనసాగించడం గర్హనీయం. ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలని భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 350 ఏ లో స్పష్టంగా పేర్కొనడం జరిగింది.

జాతిపిత మహాత్ముడు, విశ్వకవి రవీంద్రుడు ,భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ , క్షిపణి పితామహుడు ఏపీజే అబ్దుల్ కలాం ఇదే విషయాన్ని చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ పాలనలో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమం లేకపోవడం విడ్డూరం. చంద్రబాబు ప్రభుత్వానికి తెలుగు భాష పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్నా ,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడైన ఎన్టీ రామారావు పట్ల ఏమాత్రం గౌరవం వున్నా వెంటనే జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 85ను రద్దు చేయాలని, పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని ,లేదా తెలుగు మాధ్య మంలో చదివిన వారికి ఉన్నత విద్యలో, ఉద్యోగాల విషయంలో రెండు శాతం అదనపు మార్కులు కలపాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ విధంగా చేయలేకపోతే తమ పార్టీ పేరును మార్చుకొని ఇంగ్లీష్ దేశం లేదా ఆంగ్ల దేశం అని పెట్టుకోవలసిందిగా తులసి రెడ్డి తెలుగుదేశం పార్టీకి సూచించారు.

బ్రౌన్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ ,కాంగ్రెస్ నాయకులు బండారు వెంకటేశు, బద్రీనాథ్ ,రాఘవయ్య, చిన్నకోట్ల నాగరాజు, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏజెంటిక్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్

# లార్జ్ లాంగ్వేజ్ మోడల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థుల కోసం గురువారం నాడు ట్రిబుల్ ఐటీ ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగపు అధికారి డాక్టర్. డి కోనప్ప మరియు కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగం కలిసి హిట్లూప్ కంపెనీ, హైదరాబాదు వారిచే ఏజెంటిక్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రిబుల్ ఐటీ పరీక్షల విభాగపు అధికారి డా. అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఏఐ రాకతోనే ప్రపంచం మారిపోతుంది అనుకుంటుంటే ఇప్పుడు దాన్ని తలదన్నే టెక్నాజీలు వస్తున్నాయి. అలాంటిదే ఏజెంటిక్ ఏఐ కూడా. ఇది మనం వాడే ఏఐ టూల్స్ వంటిది కాదు, అంతకు మించి. ఇది మనిషి అవసరం లేకుండా సొంతంగా అప్పజెప్పిన పనులను కంప్లీట్ చేస్తుందని తెలియచేశారు. ఈ శిక్షణ, సదస్సు విచ్చేసిన ప్రముఖ హిట్లూప్ కంపెనీ, హైదరాబాదు నిపుణులు శ్రీ హర్షిత్ రాజాం, సతీష్ కోలా విద్యార్థులకు



ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో, పరిశ్రమలలో వ్యక్తిగతీకరించిన ఏఐ అసిస్టెంట్లు, ప్రాథమిక టాస్క్ ఎగ్జిక్యూషన్కు సంబంధిత సాంకేతికతలు, స్వయంప్రతిపత్తి చర్య, ఆరోగ్య సంరక్షణలో ఏఐ ఏ విధంగా ఉపయోగపడుతుందని, మీ ఆరోగ్యంపై నిఘా ఉంచడం, కస్టమర్ సపోర్ట్ సమస్యలను వాస్తవంగా పరిష్కరించే ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌లను అభివృద్ధి చేయడానికి, అపూర్వమైన స్థాయిలో టెక్స్టు ప్రాసెస్ చేయడానికి , రూపొందించడానికి టెక్ష్చువల్ డేటాపై తరువాత కొత్త టెక్స్ట్‌ను అవుట్ పుట్ చేయడానికి బంధించిన విషయాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు త్వరలో అదే హిట్లూప్ కంపెనీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని కంప్యూటర్ సైన్స్ విభాగపు అధిపతి డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సహాయ ఆచా ర్యలు సునీత, ఉద్యోగవకాశాల కల్పన అధికారి సుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



# యువసేవాతత్పరుడు దుష్యంత్ రెడ్డి

- వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** వైయస్సార్సీపి పులివెందుల మున్సిపల్ ఇంచార్జి చవ్వా దుష్యంత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బైపాస్ రోడ్డులోని వైయస్ మనోహర్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన ఒకకార్యక్రమంలో పార్టీనాయకులు, కార్యకర్తల సమక్షంలో మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ తదితరులు



దుష్యంత్ జన్మదిన కేక్ కట్ చేసి కార్యకర్తలకు, దివ్యాంగులకు అందించారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలు దుష్యంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం లింగాల మండల వైఎస్ఆర్సిపి నాయకుడు అంబకపల్లె క్రిష్టిపాటి గంగిరెడ్డి సమకూర్చిన నిత్యవసర సరుకులు 25 మంది దివ్యాంగుల కుటుంబాలకు నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా దుష్యంత్ రెడ్డి జన్మదినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి, అవయవాలులేని వికలాంగులకు చేయూతనిచ్చిన క్రిష్టిపాటి గంగిరెడ్డిని వైయస్ మనోహర్ రెడ్డి ఇతర నాయకులు అభినందించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, లింగాల మండల నాయకులు అంబకపల్లి బాబు రెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, భాకరాపురం రాజా, లక్ష్మీప్రసన్న, చంద్రమౌళి, ఇతర నాయకులు కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, చాగలేటి భాస్కర్, బ్యాటరీ ప్రసాద్, వాల్మీకి బాలుడు, కనక, శ్రీరాములు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణ

# వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

- జిల్లా కేంద్రానికి కోటి సంతకాల

వినతి పత్రాలను తరలించిన నైరుతి రెడ్డి, చెన్నకేశవరెడ్డి



**పామిడి - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** గుంతకల్లు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మాజీ శాసనసభ్యుడు వై. వెంకటరామి రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాలు సేకరణ చేసిన 60 వేల పేపర్లను, డైనమిక్ లీడర్ అనంతపురం




జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షురాలు, నైరుతి రెడ్డి,కీ శుక్రవారం వైఎస్ఆర్సిపి పార్టీ జిల్లా కేంద్రానికి, అందజేయడానికి వెళుతున్న సందర్భంగా గుంతకల్ గుత్తి, పామిడి మీదుగా వెళ్తు ర్యాలీ నిర్మించడం డాక్టర్ అంబేద్కర్‌కి, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి వేల పేపర్లు రథం కి జెండా ఊపి జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ, పామిడి చెన్నకేశవరెడ్డి పామిడి టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్, రామకృష్ణ నాయక్ మాజీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి,టౌన్ మాజీ కన్వీనర్ బొల్లు వెంకటరామిరెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పామిడి సూరి కాసిం వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్లాలి

### - వైసీపీ గ్రామ పార్టీ నూతన కమిటీల నియామకం



**వేముల - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి సూచనల మేరకు వేముల మండల పరిధిలోని కనంకింద కొట్టాల పంచాయతీ వైస్సార్సీపీ గ్రామ పార్టీ నూతన కమిటీల నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పిటిసి కోగటం భయపు రెడ్డి, వేముల ఎంపిపి చల్ల గంగాదేవి వెంకటనారాయణ, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మరక శివ కృష్ణా రెడ్డి యాదవ్,సర్పంచ్ రంగనాథ,లక్ష్మి శెట్టి,శ్రీనివాసులు,సుబ్బయ్య, పెద్ద పుల్లయ్య,మధు మోహన్ రెడ్డి,ఐటీ విభాగం సుభాష్ రెడ్డి వైఎస్ఆర్ సీపీ నాయకులు,మహిళలు, హాజరై కమిటీ నియామకాలు చేపడుతూ, పార్టీ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్క వైసిపి కార్యకర్త రానున్న రోజుల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని సంకల్పంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సైనికుడిలా పని చేసి వైసిపి విజయం సాధించాలని సూచించారు.ఈ కార్యకర్తలు, అభిమానులు మండల వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### - బూత్‌లు పరిశీలించిన టీడీపీ కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జా మైసూరా రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** తెలుగుదేశం పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఆదేశానుసారం బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల కాసినాయన మండలంలో ఉన్నటువంటి కొన్ని బూతులకు అబ్జర్వర్గా కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జా మైసూరా రెడ్డి నియమించడం జరిగింది. పార్టీ ఆదేశానుసారం పోరుమామిళ్ల కాశీనాయన మండలాలలో ఉన్నటువంటి కొన్ని బూతులు పరిశీలించి బూత్ కన్వీనర్లు కో కన్వీనర్లు తో కలిసి గ్రామ కమిటీ మెంబర్లతో ఆ బూత్ కు సంబంధించినటువంటి విషయాలను సేకరించడం జరిగింది. అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఏవైనా చిన్న చిన్న సమస్యలు కార్యకర్తల మధ్య ఉంటే వాటిని తక్షణమే పరిష్కరించుకొని గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేసే బద్వేల్ నియోజకవర్గం పూర్వ వైభవం తీసుకురావాలని అక్కడున్నటువంటి బూత్ కన్వీనర్లను గ్రామ కమిటీ అధ్యక్షులను పార్టీ నాయకులను కార్యకర్తల తో కలిసి మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ యూత్ కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇంటింటా ఫీవర్, లార్వా సర్వే

### - జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్:ఖాజా మౌనిద్దీన్





**లింగాల - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** లింగాలలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్:ఖాజా మౌనిద్దీన్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అక్కడి గృహాలను పరిశీలించి దోమల పెరుగుదలకు కారణమయ్యే నీటి నిల్వలను తొలగించడం జరిగింది. యం.ఎల్.హెచ్.పి/ సి.హెచ్.ఓ లకు, ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు డాక్టర్: ఖాజా మౌనిద్దీన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి సిజనల్ వ్యాదుల గురించి అవగాహనా కల్పిస్తూ, డాక్టర్: ఖాజా మౌనిద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వారానికి ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా దోమల వృద్ధి తగ్గుతుందని, తద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి దోమల ద్వారా వచ్చే వ్యాధులను నియం త్రించవచ్చని, ఇంటి లోపల బయట ఉపయోగించని కంటైనర్లలో, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఖాజా మౌనిద్దీన్ తెలిపారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రి సమయంలో దోమతెరాలు వాడాలి అని, వాడని వస్తులను కుండలు, ప్లాస్టిక్ సామానులు, డబ్బాలు వంటి వస్తువులను ఇంటి పరిసరాలకు దూరంగా ఉంచాలి అని సిద్దయ్య అన్నారు. ఈ కార్యక్రమములో లింగాల వైద్యాకారి డాక్టర్: ప్రసన్న కుమార్, డాక్టర్: గౌతమి. పి.హెచ్.ఎన్ కుసుమ కుమారి పాల్గొన్నారు.

# ఖబడ్దార్ చంద్రబాబు నాయుడు

- ప్రజా ఆస్తులను అమ్ముకోవాలని చూస్తే ఊరుకోం
- మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్ హెచ్చరిక
- ఎద్దుల బండిపై వినూత్న ర్యాలీ
- కోటి సంతకాల వినతిపత్రాల అందజేత
- భారీగా తరలివచ్చిన వైసీపీ శ్రేణులు





**గార్లదిన్నె- సూర్య వాస్తవం, డిసెంబరు 12 :** సింగనమల నియోజకవర్గంలో కోటి సంతకాల కార్యక్రమం పూర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 1,04,034 సంతకాల సేకరణ (లక్ష నాలుగు వేల ముప్పై నాలుగు). కోటి సంతకాల పత్రాల్ని జిల్లా పార్టీ కార్యాలయానికి పంపిణీ. పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకులు ఎల్.ఎం. మోహన్‌రెడ్డి. ప్రజా ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చంద్రబాబు చూస్తే వైఎస్సార్సీపీ చూస్తూ ఊరుకోదని మాజి మంత్రి డా. సాకే శైలజానాథ్ తీవ్ర స్థాయిలో మండిపాటు. బుక్కరాయసముద్రం వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఎద్దుల బండిపై వినూత్న ర్యాలీ.బైక్ ర్యాలీగా జిల్లా వైసీపీ కార్యాలయానికి చేరుకున్న నేతలు-శ్రేణులు.పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి కోటి



సంతకాల పత్రాల అందజేత. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా హక్కుల కోసం కోటి సంతకాలు సేకరణ. చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలకు వ్యతిరేకంగా నియోజకవర్గ వ్యాప్తంగా 1,04,034 సంతకాలు సేకరణ ఇప్పటికైనా ప్రైవేటీకరణ ఆలోచన మానుకుని ప్రజల హక్కులను కాపాడాలని చంద్రబాబుకు డిమాండ్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు, అందులో 5 పూర్తయ్యాయి. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. వెంటనే కూటమి ఆలోచన మానుకోవాలి. ఈ దుర్మార్గ ఆలోచనలను అడ్డుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. కోటి సంతకాలను మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గవర్నర్‌కు అందజేయనున్నారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని చంద్రబాబు-పవన్‌లకు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ఫుల్ స్టాప్ పెట్టాలని డిమాండ్ చేసిన మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా సెమి గ్రాండ్ క్రిస్టమస్ వేడుకలు

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు, ఛైర్మన్



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** పులివెందుల పట్టణంలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా దళిత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్, మునిసిపల్ ఛైర్మన్ వరప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం ముందస్తుగాక్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ప్రకాశం, ఏపీడి సమస్త వారు పాస్టర్ ప్రశాంత్, దేవరాజ్, కృప రాజ్, డేవిడ్ రాజ్, క్రాంతి రాజు, అశోక్, ఉదయ్ కిరణ్, అశోక్ తరుణ్, విజయ్ ప్రకాష్, రాజ్, డీజే మణి, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీలు ఏర్పాటు చేయాలి

### - మున్సిపల్ ఇన్‌చార్జి వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కష్టపడి పనిచేసే వారిని వార్డు కమిటీల్లో నియమించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైయస్ మనోహర్ రెడ్డి ఛైర్మన్ వరప్రసాద్ మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్‌లు సుజాత థియేటర్ సమీపంలో 17వ వార్డ్, రంగాపురం మధు, భాస్కర్ రెడ్డి, బాబు, రాజేశ్వరి ల ఆధ్వర్యం లో నిర్వహించిన వార్డు కమిటీ ఎన్నిక కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ వార్డు స్థాయి నుండి పార్టీని పటిష్టం చేసేందుకు ఏర్పాటు చేస్తున్న కమిటీలలో పార్టీ పట్ల విధేయత ఉన్న వారిని ఏం చేయాలని సూచించారు. కమిటీ సభ్యులకు ఏ కష్టం వచ్చినా పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ హాఫీజ్, ఓ.రసూల్, చంద్రమౌళి, కనక కోడిగుడ్ల సంపత్ సాయి వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా దాసరి భానుప్రకాష్



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబరు 12 :** కడప జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పులివెందులకు చెందిన బీజేపీ సాంస్కృతిక శాఖ రాష్ట్ర కన్వీనర్ దాసరి భానుప్రకాష్ నియామకమయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 13 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేయగా అందులో బీజేపీకి కడప జిల్లాను కేటాయించగా భారతీయ జనతా పార్టీలో గత పది సంవత్సరాలుగా కీలకంగా వ్యవహరిస్తూ పార్టీలో తనదైన ముద్ర భానుప్రకాష్ వేసుకున్నారు. బీజేపీలో చురుకుగా ఉంటూ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో ఆయనకు ఈ పదవి దక్కినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ తనను కడప జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## దత్త పాదుకా క్షేత్రంలో అనఘాష్టమి వ్రతం





**పామిడి - సూర్య వాస్తవం, డిసెంబరు 12 :** పామిడిలో అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో అష్టమి సందర్భంగా ప్రధాన శ్రీ అనఘాష్టమి వ్రతం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్యానుగ్రహంతో, పూజ్య శ్రీ బాల స్వామీజీ ఆదేశానుసారం నిర్వహించిన ఈ వ్రతంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం వ్రతం ప్రారంభమైన కార్యక్రమంలో శ్రీ అనఘా లక్ష్మీ మాతకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా, అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగిందిఈ పవిత్ర వ్రతంలో పాల్గొన్న భక్తులు అనఘా లక్ష్మీ మాత కృపతో సర్వ ఆపదల నివారణ, కార్యజయాలు, ఆరోగ్యం, శాంతి, ఐశ్వర్యం పొందాలని అర్చకులు అమరేంద్ర తెలియజేశారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## అయ్యప్ప మహా పాదయాత్రకు వైఎస్ జగన్ సంఘీభావం

### - జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభమైన అయ్యప్ప మహా పాదయాత్ర



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబరు 12 :** మహా పాదయాత్ర స్వాములకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. అయ్యప్ప మహా పాదయాత్ర చేపట్టిన వైఎస్ఆర్సిపి నాయకులు బండి శ్రీనివాసులరెడ్డి గురు స్వామికి ఫోన్ ద్వారా మహా పాదయాత్ర విశేషాలు, యోగ క్షేమాలు కనుక్కున్నారు.. అయ్యప్ప మహాపాద యాత్ర విజయవంతంగా సాగి శబరిమలై చేరుకోవడంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి, బండి శ్రీనివాసులరెడ్డి స్వామికి అభినందనలు తెలిపారు.

# అభివృద్ధి, సమస్యలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం

- 18 నెలల్లో రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ
- ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయమే వైసీపీ లక్ష్యం
- ప్రజా దర్బార్‌లో ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** అభివృద్ధి సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, 18 నెలల్లో రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరిగిందని, కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని, జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక కార్యకర్త సైనికుల్లా పనిచేసే కూటమి కుట్రలను తిప్పి కొట్టాలని, రైతులను దగా చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యమని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారంఆయన నివాస ప్రాంగణంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమే అని చేతల ప్రభుత్వం కాదని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చకపోవడం దారుణం అన్నారు. రైతుల సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కూటమి ప్రభు త్వం అన్నారు.రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా ప్రభుత్వం కల్పించలేదని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకపోవడం ఏమిటి అన్నారు. నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి పెండింగ్లో ఉన్న పనులు ఇంతవరకు పూర్తి చేయడంలో విఫలమైందన్నారు. జగనన్న రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తే వాటిని కూడా ప్రైవేట్ పరం చేయాలని కూటమి ప్రభుత్వం చూడడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలోనే ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి కావడం జరిగిందన్నారు. వచ్చిన మెడికల్ సీట్లను వెనక్కి పంపించిన ఘనత కూటమి ప్రభుత్వం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. పేద ప్రజల ఉసురు చంద్రబాబు నాయుడుకు కూటమి నాయకులకు తగులుతుందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తే వైకాపా ఆధ్వర్యంలో నిరసన కార్య క్రమాలు జరుగుతూనే ఉంటాయన్నారు. జరగబోయే ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సంసిద్ధమై ఉండాలన్నారు. కూటమి కుట్రలను తెప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకు ముందుగా పులివెందులనియోజకవర్గం ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు ఆయననుకలిసి వినతిపత్రాలను అందజేశారు. మరి కొంతమంది సమస్యలను ఆయనకు నేరుగా వివరించారు.

ఆయన వారి సమస్యలను సావా దానంగా విని వారి సమస్యలను పరిష్కరింప జేసేందుకు కృషి చేస్తా అన్నారు. మరి కొంతమంది సమస్యలను అధికారులతో చరవాణిలో మాట్లాడి పరిష్కరింపజేశారు.

## జరగబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేస్తా

### - రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా కొంగనపల్లి విజయ్ కుమార్



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబరు 12 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రెటరీగా కొంగనపల్లి విజయ్ కుమార్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయ్ కుమార్ , గండి దేవస్థానం ఛైర్మన్ తేజ, అంకాలమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ ప్రసాద్, సోపాల వీర, రవి, మురళి, వెంకటసుబ్బయ్య, సాయిలు, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కలిసి దుష్యాల్వాతో గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి, వైఎస్ మనోహర్ రెడ్డికి, వైయస్ మదన్మోహన్ రెడ్డికి, దుష్యంత్ రెడ్డికి, దేవి రెడ్డి శివశంకర్ రెడ్డికినా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. నాపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టినందుకు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తాను అన్నారు. జరగబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేస్తా అన్నారు. అధికార పార్టీ తప్పులను చూపుతూ సోషల్ మీడియాలో దుమ్ము ఎత్తిపోస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నాగ శేఖర్, హరి, బలిజ సంఘీయులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కమిటీల ఏర్పాటు



**లింగాల– సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ బలోపేతం కోసం గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుకు వైసీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలులి, కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి సూచనల మేరకు గ్రామలలో పండుగ వాతావరణం మొదలయింది. ఈ కార్యాచరణ మరింత దూకుడుగా జరగాలని లింగాల మండల వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ బాబురెడ్డి తెలిపారు అనంతరంలి లిరైతు విభాగం అధ్యక్షులు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి పులివెందుల మున్సిపల్ ఇంచార్జి చవ్వా దుష్యంత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ చేశారు. లింగాల గ్రామంలో వైసీపీ గ్రామ కమిటీల ఏర్పాటు జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## కూలీలకు గిట్టుబాటు ధర కల్పించాలని వినతి



**కదిరి– సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో దిన కూలీలుగా పనిచేస్తున్న వారికి కూలీల రేట్లు పెంచాలని కదిరి వ్యవసాయ పరిశోధనా అధికారికి వ్యవసాయ కూలీల సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప శుక్రవారం వ్యవసాయ పరిశోధన అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు,

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీ సత్య సాయి జిల్లా సమితి ఆధ్వర్యంలో కదిరి ప్రాంతం, పట్టణ పరిసరాలలోనూ వివిధ గ్రామీణ ప్రాంతాల నుండి వ్యవసాయ కూలీలు గా పనిచేస్తున్న వారి పరిస్థితిని ప్రత్య క్షంగా పరిశీలించామని కదిరి నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో జీవనోపాధి కోసం అవకాశాలు తగ్గిపోవడంతో పెద్ద సంఖ్యలో కూలీల వ్యవసాయ పరిశోధన శాఖలో దిన కూలీలుగా పనిచేస్తున్న కూలీలకు ఇచ్చే రోజువారి ధరలు ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలకు ద్రవ్యోల్బణానికి, జీవన వ్యయానికి పూర్తిగా అనుగుణంగా లేవు అని పేర్కొన్నారు, ఫలితంగా రోజువారి కూలీలకు గిట్టుబాటు లేకపోవడం వల్ల జీవనం దెబ్బతింటుందని తెలియజేశారు, ఈ పరిస్థితిని పరిశీలించి అధికారులు కూలీలకు న్యాయమైన రేటు కనిపించి వారిని నేనుఆదుకునే బాధ్యత ఎంతైనా ఉందని తెలియజేశారు. సిపిఐ నాయకులు ఆదినారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బ్రహ్మయ్య, చరణ్, సుధాకర్, చెన్నకేశవులు, బాలకృష్ణ, వెంకట రాముడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన నూర్భ దూదేకుల సంఘాలు



**మదనపల్లె – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషను శుక్రవారం సాయంత్రం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లోనే టిడిపి కార్యాలయంలో నూర్భ దూదేకుల సంఘాలు ఘనంగా సన్మానించారు. మదనపల్లె జిల్లాను సాధించడానికి నిర్విరామ కృషి చేసిన ఎమ్మెల్యేకి మదనపల్లి జిల్లా సాధన కీర్తి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రాంత అధ్యక్షులు ఇందాదుల్ల, చిత్తూరు జిల్లా అధ్యక్షులు షఫీ సాహెబ్, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్, ముజీబ్ హుస్సేన్ తదితరులు పాల్గొని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దూతేకుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోపై అవగాహన





**తనకల్లు–సూర్య వాస్తవం, డిసంబర్ 12 :** తనకల్లు మండల పరిధిలో కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలి యో కార్యక్రమంపైన వాలంటీర్లకు అవగా హన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 21వ తారీకు ఆదివారం ప్రతి ఒక్క ఊరిలోనూ నిర్వహిస్తామని డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు.ప్రతి సంవత్సరం పోలియో చుక్కలు అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలు లోపు పిల్లలందరికీ రెండు పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియోను అరికట్టవచ్చని డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి తెలియజేశారు. మనదేశంలో ప్రతి ఊరిలోన ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా పోలియో చుక్కలు వేసి వేయించి పోలియో రహిత భారతదేశాన్ని నిర్మించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై ప్రతి ఒక్కరూ వాలంటీర్‌గా పిల్లలందరికీ టీకాలు వేయించాలని కోరడమైనది ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని జయప్రదం చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎంఎల్ో వాచ్‌పిలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## జరగబోయే ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలి

### - ఎర్రిపల్లె గ్రామంలో కోర్ కమిటీల సమావేశం

**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ గ్రామ అనుబంధ విభాగాల కోర్ కమిటీ పర్యవేక్షణ సమావేశం ఎర్రిపల్లె గ్రామంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకుల ,కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ గ్రామల అనుబంధాల కమిటీ సమావేశాలు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. రాబోయే ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుంది

### - ఎమ్మెల్యే షాజహాన్ బాషా



**మదనపల్లె – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** ఆత్మరక్షణకు కరాటి విద్య ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కదిరి రోడ్డు, ఎల్.ఐ.సీ బిల్డింగ్ ఎదురుగా మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ఎమ్మెల్యే అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మరక్షణకు కరాటి విద్య ఎంతో ముఖ్యమ న్నారు. డాక్టర్ స్వర్గీయ ఏ.ఆర్ సురేష్ కరాటేలో మదనపల్లికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చా రన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో మురళి విద్యార్థులకు చక్కని శిక్షణ అందిస్తున్నారన్నారు. విద్యా ర్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొంది విపత్కర పరిస్థితులలో తమను తాము రక్షించుకోవాలని సూచించారు.అకాడమీ నిర్వాహకులు మురళి మాట్లాడుతూ మదన పల్లి జిల్లా ఏర్పాటులో క్రియాశీలక పాత్ర పోషించిన ప్రజానాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో వివిధ కటా విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటికే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు సత్తా చాటారని వివరించారు.

## బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

### - మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ లక్ష్యమని లక్కిరెడ్డిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యనుమల మధన్ మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం పల్లె బాట కార్యక్రమంలో నాలుగోరోజు అప్పకొండయ్యగారిపల్లి గ్రామం చింతకుంతపల్లి,ఉత్తరమిట్ట హరిజనవాడ, గంగనపల్లి లో పర్యటించారు. గ్రామ ప్రజలు అడుగడుగున ఆత్మీయ స్వాగతాలతో పాటు గజమాలలు దుశ్శాలువతో సత్కరించి బాణసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకుని వారికి కావాల్సినటువంటి త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ కాలవలు మొదలైనటువంటి మౌలిక వసతులను మంత్రి సోదరులతో మాట్లాడి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తెలుగుదేశం పార్టీతోనే ప్రజా సమస్యలు తిరుతాయిని ప్రజా సమస్యల కోసం కూటమి పెద్దపీట వేస్తుందని అన్నారు .మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డితో మాట్లాడి ఇండ్లు లేని పేదలకు పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తానని అర్హులైన ప్రతి ఒక్క ఒక్కరికి 3 సెంట్ల ప్రభుత్వ స్థలంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కడిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ తో పాటు, తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు శంకరపు జయరాం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బీజేపీ కృష్ణ, డీలర్ అన్వర్ సాధట్, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు,పక్కిరయ్య రామచంద్ర, గురుస్వామి గురుస్వామి వెంకటేశ్వర్లు, చింతకుంటపల్లి బాబు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

# జ్ఞాననేత్రంతో సాహితీ సేవకు అపూర్వ సత్కారం

**- అనువాద రంగంలో కృషికి జక్కంపూడిని సత్కరించిన తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి**



**తిరుపతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** జ్ఞాననేత్రంతో ఆరు దశాబ్దాలుగా సాహితీ సేవను కొనసాగిస్తున్న ప్రముఖ కవి, రచయిత శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు జక్కంపూడి మునిరత్నంకు అరుదైన గౌరవం లభించింది. తెలుగు, తమిళ సాహిత్యాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవను గుర్తించి తమిళనాడు లోక్ భవన్ లో మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకొని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి అపూర్వమైన సత్కారాన్ని జక్కంపూడికి అందించారు. తమిళ సాహిత్యంలోని "పత్తుప్పాట్టు, ఎట్టుత్తొగై" అనే శ్రేష్ఠ గ్రంథాల సమాహారాన్ని మరో ఇద్దరు ఆచార్యులతో కలిసి మొత్తం 18 పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. ప్రాచీన తమిళ కేంద్ర సంస్థ వారు ఈ విశిష్ట గ్రంథ అనువాద సేవను గుర్తించి, గవర్నర్ చేతుల మీదుగా జక్కంపూడిని సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అనువాద రంగంలో తెలుగు–తమిళ భాషల మధ్య వారధిగా నిలిచే పండితుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

**మూడు దశాబ్దాల బోధన, పరిశోధన సేవ**

తన రచన ప్రస్థానంలో ఆచార్య జక్కంపూడి మునిరత్నం దేశవ్యాప్తంగా ఇప్పటికే అనేక పురస్కారాలను అందుకున్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో మూడు దశాబ్దాల పాటు బోధన, పరిశోధన సేవలను అందించిన ఆయన విశ్రాంత జీవితంలోనూ రచన ప్రక్రియను కొనసాగిస్తూ అనువాద రంగంలో తనదైన ముద్రను చాటుతున్నారు. తెలుగు తమిళ సాహిత్యాలలో తనకున్న ప్రావీణ్యాన్ని అక్షర రూపంలోకి తీసుకొస్తూ భావి భారత పరిశోధకులకు ఆదర్శంగా నిలవడం శుభపరిణామం.

తమిళనాడు గవర్నర్ నుంచి సత్కారాన్ని అందుకున్న సందర్భంగా తిరుపతికి చెందిన పలువురు రచయితలు, అధ్యాపకులు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

## పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీలే కీలకం



**తొండూరు – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మార్గదర్శకత్వంలో గ్రామ గ్రామాన కమిటీల ఏర్పాటు వేగం పెంచుకుంది. శుక్రవారం అగడూరు, ఊడవగండ్ల గ్రామాల్లో కొత్త గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు మరింత ఊపిరి వచ్చింది. ఈ సమావేశాలకు తొండూరు మండల వైసీపీ కన్వీనర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమా లను ఉత్సాహభరితంగా మార్చారు. గ్రామ స్థాయిలో పార్టీ శక్తిని పెంపొందించడం, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజలకు సులభంగా చేరవేయడం, పార్టీ సిద్ధాంతాలు ప్రతి ఇంటికీ చేరేలా చేయడం కమిటీల ప్రధాన లక్ష్యమని జిల్లా ఉపాధ్యక్షులు డివి శశికాంత్ రెడ్డి తెలిపారు. గ్రామ కమిటీల ఏర్పాటు ద్వారా వైసీపీ మరోసారి గ్రామాల్లో బలోపేత దిశగా కీలక అడుగులు వేస్తోందని నేతలు అభిప్రాయపడుతున్నారు.

## వాటర్ షెడ్ పనులకు జలహారతి

**- మండల తెదేపా బాధ్యులు యనమల మదనమోహన్**



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** వాటర్ షెడ్ పనుల వలన కోనంపేట బి.ఎర్రగుడి ప్రాంతాలలో గణనీయంగా భూగర్భ జలాలు పెరిగాయని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని లక్కిరెడ్డిపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ యనమల మదన్మోహన్ పేర్కొన్నారు. ఎర్రగుడి ప్రాజెక్టు కోనంపేట పంచాయతీ నందు వాటర్ షెడ్ లో చేసిన పనులను టిడిపి మండల అధ్యక్షుడు యనమల మదనమోహన్ జల హారతి ఇచ్చి జాతికి అంకితం చేశారు. వాటర్ షెడ్ పనుల వలన భూగర్భ జలాలు గణనీయంగా పెరగడంతో గ్రామాల రైతులు ఆనందం వెల్లి విరిసిందని అన్నారు. ఫారం ఫండ్ గుంతకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్ లక్కిరెడ్డిపల్లి తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు చెల్లు శ్రీనివాసులు యాదవ్ రాష్ట్ర దళిత ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు, తెలుగుదేశం పార్టీ కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ దప్పేపల్లి సర్పంచ్ కేశవయ్య, టిడిపి నాయకులు వెంకటనారాయణ, అబ్దుల్ రజాక్, యోగాంజనేయులు రెడ్డి, నాగ మల్లయ్య నాయుడు, మాజీ ఎంపీటీసీ చిన్న గంగయ్య, కావలి ఆంజనేయులు, బిజెపి కృష్ణయ్య, వాటర్ షెడ్ చైర్మన్లు కమిటీ మెంబర్లు, పిఓ వెంకట్రామిరెడ్డి, జేఈ నరసింహారెడ్డి, టివో వెంకటరమణ, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దాం

**- జడ్పీటిసి ఎం.రవి కుమార్ రెడ్డి**



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** వెలమాలపల్లె, కుప్పలపల్లి గ్రామాలలో వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కల్లూరి చంద్రబాబు రెడ్డి, రుద్ర భాస్కర్, మైనార్టీ నాయకుడు, రామ్ శేఖర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి అలాగే వెలమారపల్లె, కుప్పలపల్లె గ్రామ ప్రజలు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు తొలగింపు

**- టీడీపీ నేత మోండోడు గౌస్**

**వేంపల్లె – సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** స్థానిక పంచాయతీ పరిధిలోని మదీనాపురం మసీదు వద్ద ముస్లిం స్మశానంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించినట్లు టిడిపి నేత మోండోడు గౌస్ అన్నారు. శుక్రవారం తన సొంత ఖర్చులతో జేసిబి ద్వారా పిచ్చి మొక్కలు తొలగించి, పరిశుభ్రత చేశారు. దీంతో ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.జిలాన్, బాబా, మహమ్మద్, ఇస్మాయిల్, మెకానిక్ బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.




## చౌక ధరల దుకాణాలను తనిఖీ చేసిన ఫుడ్ కమిషనర్



**పామిడి –సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** పామిడిలోని పలుచౌక ధరల దుకాణాన్ని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ గంజిమాల దేవి శుక్రవారం తనిఖీ చేశారు. చౌక డిపోలో ని ఉన్న బియ్యం, జొన్నలు, రాగుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. డీలర్ కె.నారాయణ మూర్తిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అయన చేస్తున్న ఇతర సేవలను కూడా విన్నారు. ఆమె వెంట డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తూనికలు, కొలతల శాఖ ఇన్స్పెక్టర్ శంకర్, ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.

## వైసీపీ యువజన విభాగం ఆత్మీయ సమావేశం







**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** వైసీపీ అధినేత వై.ఎస్,జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు...సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య. ఆదేశాలతో... వైసిపి రాష్ట్ర యువజన అధ్యక్షుడు జక్కంపూడి రాజా మరియు వైసీపీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ (జోన్–4) భూమన అభినయ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలో జరిగిన వైసిపి యువజన విభాగ ఆత్మీయ సమావేశానికి సూళ్లూరుపేట నుండి వైసీపీ యువజన నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ యువజన అధ్యక్షుడు పాలేటి నాగార్జున ఆధ్వర్యంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నాగిరెడ్డి లక్ష్మీ ప్రసన్న కుమార్ రెడ్డి, దొరవారిసత్రం వైసీపీ మండల అధ్యక్షుడు అల్లూరు రాహుల్ రెడ్డి,వైసీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా యువజన కార్యవర్గ సభ్యుడు చేవూరు అఖిల్,వైసీపీ నాయుడుపేట మండల యువజన నాయకులు అన్నమాల అనిల్ రెడ్డి, దొరవారిసత్ర మండల యువజన నాయకులు గోను ప్రసాద్, నియోజకవర్గ వైసిపి యువత పాల్గొన్నారు.

## నేడు ఓజిలి మండలంలో విద్యుత్ మరమ్మతులు

**- సరఫరాకు అంతరాయం: ఏఈ అనిల్ కుమార్**

**పెళ్లకూరు– సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** ఓజిలి మండల పరిధిలో నేడు విద్యుత్ మరమ్మతులు కారణంగా సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అనిల్ కుమార్ ప్రకటించారు. మరమ్మత్తు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కురుగొండ, ఆర్మీనిపాడు, వజ్జవారిపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు తాత్కాలికంగా విద్యుత్ నిలిచిపోతుందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ సమాచారాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## బిల్లుల జారీపై ఆవేదన

**-మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించిన వైసీపీ కౌన్సిలర్లు**



**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** నాయుడుపేట అంబేద్కర్ భవనంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని వైసీపీ కౌన్సిలర్లు బహిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బిల్లుల జారీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. వైసీపీ వైస్ ఛైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ "గత మూడు సంవత్స రాలుగా మా ఆధ్వర్యంలో పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల పనుల బిల్లులు కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నిలుపుదల చేశారు. బిల్లులపై సరైన సమాధానం కూడా ఇవ్వడం లేదు. అందుకే మా నిరసనగా సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం" అని తెలియపరిచారు. కౌన్సిలర్లు కూడా ఇదే ఆవేదన వ్యక్తం చేస్తూ "కాంట్రాక్టర్లకు బిల్లులు పాస్ చేసిన తరువాతనే భవిష్యత్ మున్సిపల్ సమావేశాలకు హాజరవుతాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పాపా రెడ్డి చంద్రారెడ్డి, ధారా రవి, షేక్ షబ్బీర్ భాష, కావేరిపాకం అశోక్ కుమార్, సరిత, కో–ఆప్షన్ సభ్యుడు చదలవాడ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

**- సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ**



**సూళ్లూరుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్–ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజలు భారీగా హాజరయ్యారు. ప్రజల నుండి నేరుగా సమస్యలను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో దర్బార్‌కు మంచి స్పందన లభించింది. ప్రజా దర్బార్‌లో మొత్తం 47 అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సూచనలు అందజేసినట్లు శాసనసభ్యురాలు – డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ "గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రధాన లక్ష్యం. ప్రతి అర్జీపై వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేస్తాం.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, విత్తనాల అక్రమ విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట తహసిల్దార్ పెళ్లూరు గోపీనాథ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





# డిస్కవర్ అనిల్ సేవలు స్ఫూర్తిదాయకం...!

## - పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందజేత





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** నగరపాలక సంస్థ పారిశుద్ధ కార్మికుల సంక్షేమమే శ్రేయస్సుగా భావించి వారి అభ్యున్నతి కోసం అనుక్షణం పాటుపడుతున్న సామాజికవేత్త డిస్కవర్ అనంతపురం అనిల్ సేవలు స్ఫూర్తిదాయకం.అనంతపురం నగరపాలక సంస్థ ఆవరణలో డిస్కవరీ అనంతపురం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అనంతపురం శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ , రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, తదితరులతో కలిసి పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు స్వచ్ఛంద సంస్థ ఉచితంగా అందిస్తున్న సేఫ్టీ పరికరాలను అందజేశారు. ప్రతి కార్మికునికి 100 మాస్కులు, 10 ఎన్95 మాస్కులు, అధునాతన ఫైర్ బోల్ట్ షూలు, సేఫ్టీ గ్లాసెస్‌లను డిస్కవరీ అనంతపురం సంస్థ ద్వారా అందించారు. ఈ సందర్భంగా డిస్కవరీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అనిల్ కుమార్ ను ఎమ్మెల్యే దగ్గుపాటి, ఛైర్మన్ పట్టాభి అభినందించారు. అలాగే పర్యావరణహిత బట్ట సంచులను, షూ, కళ్ళ జోల్లు, మాస్క్ లు, గ్లోవ్స్ తదితర పరికరాలను పలువురు పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు అనేక సంక్షేమ కార్య క్రమాలు చేపట్టిందని తెలిపారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# మదనపల్లి యువకుడు మంగాపురంలో దారుణ హత్య

## - హత్యకు అక్రమ సంబంధమే కారణం అంటున్న సీఐ కళా వెంకటరమణ









**మదనపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 12:** మదనపల్లె మండలంలోని ఆవులపల్లి రామాపురానికి చెందిన నరసింహులు(40) హత్యకు అక్రమ సంబంధమే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. శుక్రవారం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, మంగాపురం సమీపంలో సీఐ హత్య కేసుపై మీడియాతో మాట్లాడుతూ.. నరసింహులుతో తన కుటుంబం ఇబ్బందులు పడుతోందని, తంబళ్లపల్లె నియోజకవర్గం లోని కురబలకోట మండలం, గడ్డఎత్తు పల్లెకు చెందిన నాగరాజు తన అనుచరులతో కలిసి అక్టోబర్ 27న తిరుపతి జిల్లా మంగాపురానికి తీసుకువచ్చి ఓ మామిడి తోటలో పథకం ప్రకారం హత్య చేసినట్లు తెలిపారు. నరసింహులు భార్య తమకు తన భర్త అదృశ్యమయ్యాడని ఇచ్చిన ఫిర్యాదు పై మొదట అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం టెక్నికల్ ఆధారాలతో నిందితులను పట్టుకోవడంతో నరసింహం హత్య చేసినట్లు తేలిందని చెప్పారు. హంతకులు శవాన్ని పూడ్చిన ప్రదేశం చూపగ అక్కడ రెవిన్యూ, చంద్రగిరి పోలీస్ అధికారులు, మృతుని బంధువుల సమక్షంలో తవ్వగా నరసింహుడి మృతదేహం లభించింది అన్నారు. అనంతరం వైద్యులతో స్పాట్ పిఎం చేపట్టి, ఈ కేసులో ఇప్పటికే నిందితులను అదుపులకి తీసుకున్నామన్నారు.

# రాత్రివేళ పోలీసుల పట్టిష్ట నిఘా

## - ప్రజల భద్రత ... తొలి ప్రాధాన్యత
## - జిల్లా ఎస్పీ పి.జగదీష్





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, డిసెంబర్ 12** :అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా మొత్తం పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ రాత్రి వేళల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల కోసం ముఖ్య రహదారులు, చెక్‌పోస్టులు, టోల్‌గేట్లు, పట్టణాల ప్రవేశ ద్వారాలు, గ్రామీణ పరిసరాల్లో పోలీసులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద కదలికలు గమనించిన వ్యక్తులను పోలీసులు విచారించి పంపారు. నేర నిరోధక చర్యల్లో భాగంగా పోలీసులు అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి, గస్తీ విధులను కూడా బలోపేతం చేశారు.

జిల్లా పోలీసు శాఖ సర్వత్రా అప్రమత్తంగా ఉంటోంది. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, రాత్రివేళల్లో అసాధారణ కదలికలను గమనించిన వెంటనే చర్యలు తీసుకునేలా కార్యాచరణ కొన సాగుతోంది. ప్రజల భద్రత మొదటి ప్రాధాన్యత” గా గుర్తించి ఈ దిశగా చర్యలు చేపట్టారు. ప్రజలు కూడా పోలీసుల తనిఖీలకు సహకరించాలి. అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలు, లేదా అసాధారణ కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీసు స్టేషన్ లేదా డయల్ - 100/112 కు సమాచారం అందించాలని పోలీసుల విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా దుష్యంత్ రెడ్డి 47వ జన్మదిన వేడుకలు

## - కేక్ కట్ చేసిన నూర్ భాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు



**పులివెందుల, సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** పులివెందుల పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ దుష్యంత్ రెడ్డి 47వ జన్మదిన వేడుకలను జిల్లా వైకాపా సంయుక్త కార్యదర్శి నూరుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నూర్భాష సంఘ అధ్యక్షుడు ఓతూరు రసూల్, కృష్ణపాటి గంగిరెడ్డి లు హాజరై కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుశాంత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఆయురా రోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, రమణారెడ్డి, కనకా,ఎస్టి నాయకుడు అంజన్నప్ప, వాసు, సంపత్, ఖాదురు, తదితరులు పాల్గొన్నారు.

### - అంధుల ఆశ్రమంలో అన్నదానం, కేక్ కటింగ్



పులివెందుల పట్టణ పరిధిలో శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న అంధుల ఆశ్రమంలో పులివెందుల యువ నాయకులు చవ్వా దుష్యంత్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం పులివెందల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ ఆధ్వర్యం లో కేక్ కట్ చేసి,అంధులకు స్వీట్స్, భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైయస్ మనోహర్ రెడ్డి , ఛైర్మెన్ వరప్రసాద్ , మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ చిన్నప్పల చేతుల మీదుగా కేక్ కట్ చేసి అనంతరం స్వీట్స్ ను, భోజనాన్ని అంధులకు అందజేశారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి వైసీపీ శ్రేణులు మాట్లాడుతూ సౌమ్యుడు, మృదుస్వభావి, స్నేహశీలి, మంచికి మారుపేరుగా, మహెూన్నత వ్యక్తిత్వం గల మానవతామూర్తిగా, సేవాతత్పరుడిగా, ఎందరో నిరుపేదలు, అనాథలు, అభాగ్యులు, వికలాంగుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న మన అభిమాన నాయకుడు, శ్రీచవ్వా దుష్యంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా, ఆయన ఆ దేవుని చల్లని దీవెనలతో, పులివెందుల ప్రజల ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తు దుష్యంత్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అని, ఈ కార్యక్రమంలో ఓ.రసూల్, చంద్రమౌళి, ఫైర్ రామకృష్ణ,కనక గంగాధర్, రాయుడు, సాక్షి శ్రీను, చెర్లోపల్లి శ్రీను, లక్ష్మి రెడ్డి, బాబు, గంగరాజు, భాస్కర్ రెడ్డి,విజయ్,ప్రశాంత్, భరత్, లతీఫ్, ఆశ్రమ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో



మున్సిపల్ వైకాపా ఇంచార్జ్ దుష్యంత్ రెడ్డి 47వ జన్మదిన వేడుకలను రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్లపల్లి కిషోర్ లు హాజరై ఏర్పాటుచేసిన కేకను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుష్యంత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఇంకా మరెన్నో ఉన్నతమైన పదవులను అధిరోహించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, శీను, రవి కుమార్, కలందర్ తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయకేతనం























**కుప్పం- సూర్య వాస్తవం, డిసెంబర్ 12 :** స్థానిక కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం గురువారం విడుదల చేసిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలియ జేశారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్ లో మైథిలి 9.26, సింధు 9.19, ఐశ్వర్య, 9.02, గాయత్రి 9.01, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూప్ లో అక్షయ 8.81, గంగోత్రి 8 66, అనురాధ 8.59, బీఎస్సీ బాటనీ లో ఐశ్వర్య 8.45, వనిత 8.11, త్రిష8.03, బిఎస్సీ జువాలజీలో షారోన్‌లిల్లీ 8.47, బి ఎ స్పెషల్ తెలుగులో శ్రీహర్షిత 8.42, ఎన్ ఇందు 8.06 మార్కులు సాధించి చిత్తూరు జిల్లాలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థులకు అభినం దనలు తెలియజేశారు. ప్రతి సెమిస్టర్‌లో ఇలాగే ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని హితువు పలికారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )